# పరీక్ష హాలులో ప్రహసనం

అసలిది నాకు రావల్సిన హెూదా కాదు.

అస్సలూ కాదు.

ఇంతకీ ఏమిటా గౌరవం అంటారా?

నన్ను ఫ్లయింగ్ స్క్వాడ్‌లో వేయడమే ఆ పురస్కారం.

"తమ్ముడూ! ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉందనీ అంచేత నీలాంటి ఉద్యోగులకు జీతాలు అందకపోవచ్చనీ నేను భయపడబోతుంటే ఈ శుభ పరిణామం వచ్చింది. నువ్వు నాలుగు రాళ్ల వెనకేసుకోవచ్చు. ఫ్లయింగ్ స్క్వాడ్ అంటే గోల్డ్ మైన్ అనుకో" అన్నాడు నా కోలెక్చరర్ నరేంద్ర.

ఫ్లయింగ్ స్క్వాడ్ అంటే తెలుసుగా! విద్యార్థులకు పెద్ద పరీక్షలు జరుగుతున్నప్పుడు వాళ్లకి కాపీలూ అవీ సరిగ్గా అందుతున్నాయో లేదో కనుక్కునే నిఘా దళం అన్నమాట! ఆ దళంలో విద్యాశాఖకు, పోలీసు శాఖకు చెందిన సభ్యులతో పాటు పరీక్షా సమయంలో అందే కాపీలు విద్యార్థుల విద్యాదాహాన్ని తీరుస్తున్నాయో లేదో కనుక్కునే సభ్యుడుగా నన్ను (నేను ఎన్ ఎమ్మార్ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌ని. మీకు తెలుసుగా) నామినేట్ చేశారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ అంటే వ్యుత్పత్తి అర్థం- ఆ దళం సభ్యులు పరీక్షా స్థలానికి వస్తున్నారని మేస్టర్ల ద్వారా వార్త అందిన వెంటనే పరీక్షలో కాపీ చేస్తున్న విద్యార్థులు ఒక్కుమ్మడిగా విసిరేసే పుస్తకాలని!

అవి తగలకుండా తప్పించుకోడంలోనే విద్యాధికారుల నేర్పు, ప్రొమోషన్ అర్హత నిర్ణయించబడతాయి. "ధైర్యే సాహసే లక్ష్మీ" అని కదా ఆర్యోక్తి! అందుకే ప్రొమోషన్లు సీనియారిటీ ద్వారా ఇవ్వడం బ్రిటిష్ వలసవాదులు పెట్టిన నీచ సంప్రదాయమనీ, ఎగిరి వస్తున్న పాఠ్య గ్రంథాల వల్ల దెబ్బ తగలకుండా నేర్పుగా తప్పించుకుంటూ, వాటిని చూడనట్లు నటించి, తాము వెళ్లగానే మళ్లీ అవి విద్యార్థులకు అందేలా ఏర్పాట్లు చేస్తే లక్ష్మీదేవి, రాదర్ కుబేరుడు, అంటే నల్ల డబ్బు అధిదేవత- ప్రసన్నత లభిస్తుందని ప్రతీతి.

అందుకే నాకీ గౌరవం తగదని నా బాధ. నేను నెలల తరబడి జీతాలందక పోయినా ఒక్క క్లాసూ విడిచి పెట్టకుండా పాఠాలు చెప్పే చాదస్తపు మొగుణ్ణని మా ఆవిడ (వసంత) ఏనాడో తీర్చి చెప్పేసింది. ఇప్పుడు ప్రభుత్వం ఒక్క నెల జీతాలు చెల్లించకపోయినంత

మాత్రాన నేను ఫ్లయింగ్ స్క్వాడ్ లో చేరి, భావి భారత పౌరుల చేత మార్కుల లంచాలు (అదే, కాపీ కొట్టి తెచ్చుకున్న మార్కులు) పట్టించి, అందుకు ప్రతి ఫలంగా నాలుగు రాళ్లు చేసుకోవడం నాకెలాగూ చేత కాదు. కాని పరీక్షా స్థలాల్లో మా రాకకు గుర్తింపుగా, స్వాగతంగా కిటికీలోంచీ, గుమ్మాల్లోంచీ విద్యార్థులూ, మేస్టార్లూ వెస్టిండీస్ పేస్డ్ బౌలర్ల మాదిరిగా విసిరేసే పాఠ్య గ్రంథాల తాకిడికి నాకు దెబ్బలు తగిలే అవకాశం లభించింది. అందుకు వసంత కళ్ల నీళ్లెట్టుకుని "మీరు వెళ్లకండీ, ఎవరూ ఏమీ అనుకోరు. లంచగొండి లోకంలో మంది ఎక్కువైతే మజ్జిగ పల్చన అని సామెత. మీరు రాకపోతే మిగతా వాళ్లు ఎంతో సంతోషిస్తారు." అంది. నా ఒడిలో కూర్చుని.

"వెళ్లక తప్పదు వసంతా, డ్యూటీ డ్యూటీయే. నేను ఎన్నెమ్మార్ కాలేజీలో లెక్చరర్ గా చేరుతున్నప్పుడు చేరవద్దనీ, పాఠం చెప్తున్న మేస్టార్ల మీద కాగితపు బాణాలు చాలా ఎక్కువగా విసిరే రికార్డు ఆ కాలేజీకి వరసగా పదమూడు సంవత్సరాలు లభించిందనీ ఎందరో శ్రేయోభిలాషులు గడ్డం పట్టుకుని బతిమాలారు. నేను దానికే భయపడలేదు. ఇప్పుడు అఫ్టరాల్, పుస్తకాలు! అదీ వెనకనుంచి కాదు ముందునుంచే మీదకొస్తాయి కేరేజాట్!" అన్నాను మేకపోతు గాంభీర్యంతో.

వసంత రెండు క్షణాలు గంభీరంగా ఆలోచించి "అయితే నన్ను ముద్దు పెట్టుకో" అంది.

అలాగే చేశాను.

"నా మాంగల్యమే నిన్ను కాపాడుతుంది. ప్రభూ! ప్రతివ్రతల భర్తల్ని భూత ప్రేత పిశాచాలు ఏమీ చేయలేవు ఆఖరికి ఫ్లయింగ్ స్క్వాడ్ మీదకు ఎగిరి వచ్చే పుస్తకాలు కూడా!" అని నాకు హామీ ఇచ్చి; పక్కింటి పిన్నిగారింటికెళ్లి ఓ హెల్మెట్ తీసుకొచ్చింది. అది స్కూటర్ నడిపే వాళ్ళు విధిగా పెట్టుకోవాలి. కొన్ని హెల్మెట్ల కంపెనీల ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం ఆ శాసనం పెట్టింది.

"ఇది నాకెందుకు? నేను స్కూటర్ మీద వెళ్లను! జీప్‌లో వెళ్తున్నాగా" అన్నాను.

"తెలుసు. మీరు ఈ హెల్మెట్ పెట్టుకుంటే పాటర్సన్, వాల్ష్, బెంజమిన్ ముగ్గురూ టెంత్ క్లాస్ పరీక్ష కాపీలు కొడ్తూ, మీకు స్వాగతంగా ఆ పుస్తకాలు బౌల్ చేసినా సరే దెబ్బ తగలదు. అందుకిచ్చాను. స్కూటర్ ప్రమాదాలకు ఈ హెల్మెట్లు దోహదం చేస్తున్న మాట నిజమే కాని ఇవి పరీక్షా స్థలాల్లో మిమ్మల్ని దెబ్బల నుంచి కాపాడగలవు" అంది గంభీరంగా.

* * *

మేం జీప్‌లో పాకాపురం వెళ్లాం ముందుగా. పాకాపురం "కాపీ పంట"కు ప్రసిద్ధి. ఊరంతా నాలుగు సార్లు తిరిగినా హైస్కూలు ఎక్కడుందో ఎవరూ చెప్పలేదు.

"ఐకమత్యమే బలము" అన్నాడు విద్యాశాఖకు చెందిన మా మిత్రుడు.

అయినా స్కూలు ఎక్కడుందో మాకు తెల్సిపోయింది.

నేను వెంటనే చంకనున్న హెల్మెట్ తీసి తలకు తగిలించుకున్నాను.

ఉగ్రవాదుల హైడెట్ ని చుట్టుముట్టుతున్న ప్రత్యేక పోలీసుల్లా మా స్క్వాడ్ సభ్యులం

నేర్పుగా స్కూల్ వేపు అడుగులు వేశాం. అందరి ముఖాల్లోను భయం, ఉత్సుకత తాండ విస్తున్నాయి.

కాని మా మీదకు ఎగురుతూ ఏమీ రాలేదు. ఏమీ అంటే పుస్తకాలే కాదు, కాగితపు ముక్కలు కూడా రాలేదు.

"గురూగారూ! పుస్తకాలు చూసే టెన్త్ క్లాస్ పరీక్షలు రాయాలనీ, అలా రాయకుండా కేవలం జ్ఞాపక శక్తితో పరీక్షలు రాసే వాళ్లని డిబార్ చేస్తామనీ ప్రభుత్వం వారి ఆర్డర్-జీ.వో. ఏదైనా వచ్చిందా?" అన్నాడు మాతో ఉన్న పోలీసు.

'వచ్చినా ఆశ్చర్యం లేదు' అన్నాను.

మేం పరీక్ష హాల్లోకి వెళ్లాం.

కాపీలు బాగానే జరిగి ఉండాలి. కాని ప్రస్తుతం అందుకు తెచ్చిన పాఠ్య గ్రంథాలన్నీ బోర్లించి నేలమీద వరసగా ఉన్నాయి.

"విసర్లేదేం? మీలో బౌలర్లు లేరా?" మా దళ నాయకుడు జోక్ చేశాడు.

"కాదు సార్, టీవీకి దెబ్బ తగుల్తుందని" అన్నాడు హెడ్ మాస్టారు.

"టీవీ ఏమిటి పుస్తకాల దెబ్బలేమిటి?" మాకర్థం కాలేదు.

చూపించారు.

ఆ స్కూల్‌కి ఎలక్ట్రిసిటీ లేదు. ఎందుకంటే అది పాక. గోడలు లేవు. తాటాకులు చాలినన్ని లేవు. విప్లవ విద్యా విధానం కదా. అందుకు ఓ టీ.వీ. సెట్ ఇచ్చారు. దాన్ని చోటు చాలక వరండాలో ఉంచారు. "కాపీ పుస్తకాలు విసిరితే దానికి దెబ్బ తగలచ్చని మా విద్యార్థులు మీకు పుస్తకాల స్వాగతం చెప్పలేదండీ." అన్నారు వాళ్ళు.

వెళ్ళి టీవీని చూశాం. చలికాలంలో వణుకుతూ మూల కూచున్న ముసలమ్మలా ఉన్న ఆ టీవీని చూడగానే నాకు ఏడుపొచ్చింది. నాకు హెల్మెట్ల మాహాత్యం వివరిస్తూ వసంత చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

"పోనీ ఓ సత్తప్పాలా విసురు దామని మా ఊరి హోటల్ రామన్నని అడిగామండి. అతను ఇవ్వనన్నాడండి" అన్నారు హెడ్మాస్టారు.

"అయితే ప్రతీ స్కూల్ టీ.వీ.కి పై కప్పుగా ఓ సత్తప్పాలా కూడా ఇవ్వాలని ప్రభుత్వం వారికి వినతి పత్రం పెట్టండి, నేను రికమెండ్ చేస్తాను." అన్నారు విద్యా శాఖోద్యోగి గారు.

"చిత్తం సార్. స్కూటర్ హెల్మెట్ టీవీ సైజుకి మరీ చిన్న కదండీ. అంచేత సత్తెప్పాలాలే ఉండాలి." అన్నాడు మా పోలీసు మిత్రుడు.

**(కోస్తావాణి, డెయిలీ, 15-1-88)**

★